క్లుప్తంగా

మేడ్చల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా రాములు



మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ కమిషనర్‌గా పని చేసిన అహ్మద్ షఫిఉల్లా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అధికారులు గుండ్లపోచంపల్లి కమిషనర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

క్రీడల్లో ఉత్తమ ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

శామీర్‌పేట్: శివరాత్రి పర్వదినం సందర్భంగా కీసర గుట్టలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల్లో అలియాబాద్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఖోఖో క్రీడల్లో అలియాబాద్ బాలురు ప్రథమ, బాలికలు ద్వితీయ స్థానంలో నిలవగా శనివారం బహుమతులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారిలో జరిగిన నేషనల్ సబ్ జూనియర్ ఫిస్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు నుంచి మండలంలోని మునీరాబాద్ గ్రామంలోని ఎస్‌కేఎమ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బాలికల విభాగంలో స్పందన, మహాలక్ష్మి సిల్వర్ మెడల్స్, బాలుర విభాగంలో సంకీర్త్, నాగసాయిలు బ్రాన్స్ మెడల్ సాధించారు. ఈ మేరకు శనివారం పాఠశాల కరస్పాండెంట్ లవకుమార్‌గౌడ్, విద్యార్థులు మంత్రి మల్లారెడ్డిని కలవగా ఆయన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ దీపిక నర్సింహారెడ్డి, పాఠశాల డైరెక్టర్ శృతిగౌడ్, ప్రిన్సిపాల్ సరస్వతి, నాయకులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ప్రారంభోత్సవంలో చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణకాలనీలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ టైగర్స్ కబ్స్ తైక్వాండో అకాడమీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అకాడమీ ఫౌండర్ జి.శివకుమార్, రంగారెడ్డి జిల్లా తైక్వాండో కార్యదర్శి సుధీర్ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో మేడ్చల్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: వైద్య సేవల్లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను తెలంగాణలో మొదటి స్థానానికి చేరుకోనేలా అందరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బస్తీ, పల్లె దవాఖానాలు, కంటివెలుగు కార్యక్రమంపై వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితో ఆయన జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించినట్లు జిల్లాలో వంద శాతం సాధారణ ప్రసవాలే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలన్నారు. కేసీఆర్ కిట్ రిజిస్ట్రేషన్ల నమోదు 95 శాతం కంటే ఎక్కువగా ఉండాలని, గర్భిణులకు సంబంధించిన కేసులను క్షేత్రస్థాయిలో సమన్వయంతో ఫాలోఅప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా డిప్యూటీ వైద్యారోగ్య శాఖ అధికారులు ఆనంద్, నారాయణరావు, కంటివెలుగు ప్రత్యేక పర్యవేక్షణాధికారి దివ్య, ప్రోగ్రామ్ అధికారులు సంధ్య, రాంకుమార్, కౌశిక్, డిప్యూటీ డేమో వేణుగోపాల్ రెడ్డి, డీపీఓ మంజుల ఉన్నారు.

ఎస్ఓటీ పోలీసుల దాడులు

శామీర్‌పేట్: గుట్టుచప్పుడు కాకుండా ఫాంహౌజ్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండగా విషయం తెలుసుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధి ఉప్పర్‌పల్లిలోని ఆక్సిజన్ ఫాంహౌజ్‌ను భద్రాచలానికి చెందిన ఫర్టిలైజర్ షాప్ యజమాని రామారావు బుక్ చేసుకున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన మరో ముగ్గురు ఫర్టిలైజర్ వ్యాపారులైన రాము, నరేష్, అనిల్‌కుమార్‌లతో కలిసి ఫాంహౌజ్‌కి వచ్చిన అతడు నగరానికి చెందిన ముగ్గురు యువతులను ఫాంహౌజ్‌కు తెచ్చుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయం తెలుసుకున్న మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు ఫాంహౌస్‌పై దాడులు చేసి ఆ నలుగురితో పాటు ఫాంహౌజ్ వాచ్‌మెన్ క్రిష్ణ పాండేలను అదుపులోకి తీసుకుని యువతులకు విముక్తి కలిగించారు. ఈ మేరకు శామీర్‌పేట్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ క్రీడలో అధికారి ఔట్!

అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో మేడ్చల్ కమిషనర్ దీర్ఘకాలిక సెలవు



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఆడిన రాజకీయ క్రీడలో కమిషనర్ అవుట్ అయ్యారు. చైర్‌పర్సన్ లక్ష్యంగా సాగిన ఈ రాజకీయ క్రీడలో కౌన్సిలర్ల బంతికి చైర్‌పర్సన్ కాకుండా కమిషనర్ చిక్కాడు. ఆరు నెలలుగా మేడ్చల్ మున్సిపాలిటీలోని అధికార పార్టీలో 16 మంది కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ దీపికా నర్సింహారెడ్డిల మధ్య రాజకీయ అగాధం ఏర్పడింది. 16 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్, కమిషనర్ అహ్మద్ షఫిఉల్లా కుమ్మక్కై అభివృద్ధి చేయకుండా అవినీతికి పాల్పడుతున్నారని విమర్శిస్తూ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. ఆరు నెలలుగా మేడ్చల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా వీడి జోరుగా రాజకీయాలు చేస్తున్నారు. కొందరు వైస్ చైర్మన్ గ్రూపుగా, మరి కొందరూ చైర్‌పర్సన్ గ్రూపుగా మారారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసులు ఇవ్వగా రెండో డిమాండ్ కింద కమిషనర్‌ను బదిలీ చేయాలని పట్టుబట్టారు. కమిషనర్ చైర్‌పర్సన్‌తో కుమ్మక్కై తమను ఖాతరు చేయడం లేదని, ఆయన్ను బదిలీ చేయాలని అధిష్టానం వద్ద పట్టు బట్టి కూర్చున్నారు.

మంత్రి ఇంట్లో సమావేశంతోనే...

మేడ్చల్ మున్సిపాలిటీలో సమావేశాలు నిర్వహిస్తే తరుచూ రచ్చ చేస్తున్నారని, మీడియా ముంగిట అసమ్మతి వెళ్లగక్కుతున్నారని మంత్రి మల్లారెడ్డి చైర్‌పర్సన్, అధికారులు, కమిషనర్, అధికార పార్టీ కౌన్సిలర్లతో తమ ఇంట్లో రెండు రోజుల క్రితం రహస్య సమావేశం నిర్వహించారు. అవిశ్వాస విషయం చట్ట పరిధిలో ఉండటంతో అది పక్కన పెట్టి అసమ్మతి కౌన్సిలర్ల వాదనను మంత్రి విన్నారు. తమకు విలువ ఇవ్వని కమిషనర్ అహ్మద్ షఫిఉల్లాను బదిలీ చేయాలని గట్టిగా వాదించడం, ఒక్కసారిగా బదిలీ చేసే అధికారం లేకపోవడంతో మంత్రి మల్లారెడ్డి ఇక్కడ రాజకీయం ప్రదర్శించారు. కౌన్సిలర్ల డిమాండ్ మేరకు కమిషనర్ అహ్మద్ షఫిఉల్లా వెళ్లిపోవాలని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. బదిలీకి వెంటనే ఆస్కారం లేకపోవడంతో కమిషనర్ 15 రోజుల పాటు దీర్ఘకాలికంగా సెలవు పెట్టి వెళ్లిపోయారు.

చట్టం చెప్పే కమిషనర్...

సెలవులపై వెళ్లిన కమిషనర్ అహ్మద్ షఫిఉల్లా ముక్కుసూటిగా మాట్లాడే అధికారిగా మేడ్చల్‌లో తన ముద్ర వేశారు. ప్రతి విషయంలో తాను చట్టం ప్రకారంగా ఉంటూ పనులను ఆ ప్రకారంగానే చేస్తానని బల్ల గుద్ది చెప్పేవాడు. ఎవరికి అనుకూలంగా ఉండకుండా తన దైన శైలిలో పనిచేసి ఆఖరుకు సెలవు పెట్టే వరకు తెచ్చుకున్నాడు. తనపై ఆరోపణలు చేసిన కౌన్సిలర్లకు ఆయన గతంలో మున్సిపల్ కార్యాలయంలోనే నాపై ఆరోపణలు చేసిన వారికి నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ఏది ఉన్నా తాను ఉన్నతాధికారులకు చెప్పుకుంటానని మీడియా ముందు తేల్చి చెప్పాడు. అధికార పార్టీ నాయకులు, కౌన్సిలర్లకు అండగా ఉండకపోవడంతో ప్రభుత్వ అధికారి తనకు ఇష్టం, అవసరం లేకున్నా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాల్సి వచ్చింది. రాజకీయ నాయకుల క్రీడలో ఓ అధికారి సెల్ఫ్ అవుట్ అవ్వడం స్థానిక ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

'మన ఊరు-మన బడి' పనులు సత్వరమే పూర్తి చేయాలి



కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద చేపట్టిన పనులన్నీ యుద్ధప్రాతిపదికన మార్చి మాసం కల్లా పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో పనుల జాప్యానికి సంబంధించి అలసత్వం ప్రదర్శించిన అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి పెండింగ్ పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలను కలెక్టర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితో కలిసి 'మన ఊరు-మన బడి'పై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'మన ఊరు-మన బడి' ద్వారా మొదటి విడతలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, ఆలస్యాన్ని సహించేదిలేదని హెచ్చరించారు. జిల్లాలో 176 పాఠశాలలను 'మన ఊరు-మన బడి' కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు. పనుల పురోగతిపై మండలాల వారీగా అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంమోహన్, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఓ 59ను త్వరితగతిన పూర్తి చేయాలి

జీఓ 59 కింద ఇప్పటి వరకు ఇంకా పూర్తి కాని దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం తగదని కలెక్టర్ అమయ్ కుమార్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో జీఓ 59, రెండు పడకల ఇళ్ల ప్రగతిపై జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్యతో కలిసి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత అధికారులు తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్రమబద్ధీకరణకు సంబంధించి మూడు విడతలుగా డబ్బులు చెల్లించటానికి ప్రభుత్వ ఆదేశాలకు మేరకు అవకాశం కల్పించాలన్నారు. ముగింపు దశలో ఉన్న డబుల్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మార్చి కల్లా పూర్తి చేయాలన్నారు.

'సీఎంఆర్ఐటీ'లో ప్యూర్ యూత్ క్లబ్ ప్రారంభం



యూత్ క్లబ్ ప్రారంభిస్తున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాలలో పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్(ప్యూర్) యూత్ క్లబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ క్లబ్ గ్లోబెల్ యూత్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్ అని, ఎస్‌డీజీలు ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగించి యువతను నాయకులుగా.. వారి కమ్యూనిటీల్లో సానుకూల మార్పుకై కృషి చేసేందుకు పాటుపడుతుందని ప్యూర్ సంస్థాపకురాలు ఎన్ఆర్ఐ శ్యామల తల్లూరి తెలిపారు. జాతీయ, స్థానిక సమస్యల పరిష్కారాలకై పనిచేస్తోందని, త్వరలో మరిన్ని క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్యూర్ బృంద సభ్యులు, కళాశాల అధ్యాపకులు ఎస్‌డీజీలు సాధించడంలో యువకుల పాత్రపై సమావేశం నిర్వహించారు. మరిన్ని వివరాలకు pusoenine.orf వెబ్‌సైట్, సెల్: 9959889026 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, హెచ్‌ఓడీలు పవన్‌కుమార్, నిర్మల్‌కుమార్, నిర్వాహకులు లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మేడ్చల్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పీఆర్‌టీయూ అభ్యర్థి తరుపున మండలంలోని పాఠశాలలో పీఆర్‌టీయూ యూనియన్ టీచర్లు ఎన్నికల ప్రచారం చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్య దర్శి ఆనంద్, జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్, మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిలు యూనియన్ నేతలతో కలిసి పాఠశాలలో ప్రచారం చేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఘట్‌కేసర్: రానున్న వేసవిలో అవుషాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు తాగునీటి సమస్య తలెత్తకుండా బంజారాహిల్స్ ఐలెన్సెస్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యం కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధులతో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, రైతు బంధు జిల్లా సభ్యుడు బిక్షపతిగౌడ్ హాజరై శనివారం ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, వీరేశం పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రోగ్రామ్‌లతో జాతీయత పెరుగుతుంది




కళాకారులతో ఉప కులపతి రాంచంద్రం, విజయరావు తదితరులు

ఘట్‌కేసర్: యూత్ ఎక్స్‌ఛేంజ్ ప్రోగ్రామ్ ద్వారా దేశంలో జాతీయ భావం పెంపొందుతుందని ఎన్‌వైకేఎస్ తెలంగాణ డైరెక్టర్ విజయరావు అన్నారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో శనివారం సాంస్కృతిక, ఇంటరాక్టివ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, బీహార్ రాష్ట్రం నుంచి గిరిజన యువతీ, యువకులు వారివారి సాంస్కృతిక వేషాధారణతో నాటికలు, నృత్య రూపంలో ప్రదర్శించారు. అనురాగ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తెలంగాణ సాంస్కృతి అద్దం పట్టేలా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఏయూ ఉప కులపతి రాంచంద్రం, ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్, శ్రీనివాస్‌రావు, నవీన్, కిరణ్‌కుమార్, రసూల్, మధుకర్ పటేల్, జిల్లా యువజన అధికారులు కుష్బుగుప్తా, ఐసయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

కౌన్సిలర్లు, మేనేజర్‌కు షోకాజ్ నోటీసులు

మేడ్చల్: మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో అక్రమంగా చొరబడ్డారని, మేనేజర్ రహస్య ఫైళ్లను బహిర్గతం చేశారని జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ 11 మంది అధికార బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ శ్రీదేవికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 14న మేడ్చల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు దేవ, నర్సింహస్వామి యాదవ్, మణికంఠ, కృష్ణవేణి భర్త రవిందర్‌రెడ్డి, ప్రియాంక భర్త మధుకర్, సుహాసినిబంధువు రవిందర్, అర్చనభర్త సందీప్‌గౌడ్, భవాని భర్త రాఘవేందర్‌గౌడ్(కాంగ్రెస్), మాధవి భర్త నరేందర్‌లు కమిషనర్ లేని సమయంలో ఛాంబర్‌లోకి వెళ్లగా అక్కడే ఉన్న మేనేజర్ శ్రీదేవి అత్యుత్సాహం ప్రదర్శించారు. రహస్యంగా ఉన్న ఫైళ్లను కౌన్సిలర్ల ఎదుట బహిర్గతం చేసి అందులో ఉన్న సమాచారంను కౌన్సిలర్లకు ఇచ్చారు. దీంతో సమాచారాన్ని తారుమారు చేశారనే ఆరోపణలున్నాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ 10 మంది కౌన్సిలర్లకు, మేనేజర్ శ్రీదేవికి షోకాజ్ నోటీసులు జారీ చేసి 7 రోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశాలు చేశారు. షోకాజ్ నోటీసులను కౌన్సిలర్లకు, మేనేజర్‌కు అందివ్వాలని కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

బీజేపీ కార్నర్ మీటింగ్




ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న హనుమాన్

మేడ్చల్: 'ప్రజా గోస-బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్నర్ సమావేశం మేడ్చల్‌లో నిర్వహించారు. 66, 67, 68 బూత్‌ల శక్తి కేంద్రాల సమావేశం మేడ్చల్ సాయిబాబా ఆలయ సమీపంలో నిర్వహించి పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, డాక్టర్ రాజు, ప్రభాకర్‌రెడ్డి, హేమలతారెడ్డి, రాజానంద్, జాకట ప్రేమ్‌కుమార్, వంశీ, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్ సమీపంలో...

ఘట్‌కేసర్: తెలంగాణలో నిజాం నియంతృత్వ పాలన కొనసాగుతోందని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ విమర్శించారు. 'ప్రజా గోస-బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గురుకుల్ సమీపంలో శనివారం నిర్వహించిన బన్సీలాల్ వ్యాస్ జీ శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రామతీర్థ, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సాయికృష్ణ, సంపత్ రెడ్డి, వీరేశం, ఆంజనేయులుగౌడ్, మధుగౌడ్, మైపాల్‌రెడ్డి, పవన్, ఆజయ్‌యాదవ్, విక్రాంత్‌రెడ్డి, బిక్కు నాయక్, శివ, సుమిత్, మాధవి, సుధాకర్‌రెడ్డి, సురేంద్ర, మధు, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ కాలనీలోని తుమ్మ చెరువు కట్టపై నిర్మించిన కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలుఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారిని శాస్త్రోయుక్తంగా వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. హోమాలు, యాగాలు నిర్వహించి ఉత్సవాలను వారం పాటు చేశారు. ఆదివారం బోనాల కార్యక్రమం నిర్వహించి ఉత్సవాలను ముగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంత్రి మల్లారెడ్డి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం తుమ్మ చెరువును ఆయన పరిశీలించారు. ఈ వేడుకలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికా నర్సింహా రెడ్డి, వైస్‌చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు మానస శ్రవన్ కుమార్ గుప్తా, ప్రియాంక మధుకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్



చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్ దేవరాజ్

ఘట్‌కేసర్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ఆరోగ్యానికి భరోసానిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన పదో వార్డుకు చెందిన సుమలతకు రూ.32,500, నిహారికకు రూ.10 వేలు, పదహారో వార్డుకు చెందిన నజీమ్ ఉన్నీసాకు రూ.22,500లు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయ్యాయి. కాగా కౌన్సిలర్ శశికళ దేవేందర్‌తో కలిసి అట్టి చెక్కులను లబ్ధిదారులకు చైర్‌పర్సన్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మేడ్చల్ మున్సిపాలిటీ మూడో వార్డులో..

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డుకు చెందిన సత్యనారాయణకు సీఎం సహాయనిధి నుంచి రూ.32,500 మంజూరీ అయ్యాయి. దీంతో ఆ చెక్కును శనివారం లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి వార్డు కౌన్సిలర్ జాకట దేవరాజ్ అందజేశాడు.

గుండ్లపోచంపల్లిలో...

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన శివకు రూ.20 వేలు, జయకు రూ.60 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, బాలరాజ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్, కౌన్సిలర్ శశికళ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి

చెన్నాపురం చెరువులో అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్



అక్రమ నిర్మాణాలను తొలగింపజేస్తున్న రెవెన్యూ అధికారులు

జవహర్‌నగర్: చెన్నాపురం చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. శనివారం 'సాక్షి'లో 'చెరువు కనుమరుగు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు జేసీబీతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. సెలవు దినాల్లో కొందరు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని, ఇప్పటికే చాలా మంది కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే చాలా వరకు ప్రభుత్వ భూములను గుర్తించామని, వాటిలో నిర్మాణాలు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

మల్లారెడ్డి మహిళా కళాశాలలో ఈ-సమ్మిట్ 2కే23



కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఈ-సమ్మిట్ 2కే23 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ చైర్మన్ రమాదేవి, విన్ ఫో సొల్యూషన్స్ కోఫౌండర్ వెంకటసుబ్బారాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలతలు పాల్గొని మాట్లాడుతూ.. వ్యవస్థాపకులు వ్యాపారవేత్తలుగా మారాలని, డబ్బులు పెట్టుబడిగా పెట్టడమే కాకుండా వ్యాపారంలో విజయాలు సాధించే మార్గాలను వివరించారు. వ్యవస్థాపక స్వరాలను ఒక చోటికి చేర్చి వారి అనుభవాలు పంచుకునేందుకు, సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ-సమ్మిట్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 45 మంది పారిశ్రామికవేత్తలు తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఎర్రవల్లి శ్రీనివాస్‌రెడ్డి మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)



నివాళులర్పిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డబీల్‌పూర్‌కు చెందిన ఎర్రవల్లి శ్రీనివాస్‌రెడ్డి(85) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన శ్రీనివాస్‌రెడ్డి శనివారం తన గ్రామంలో తన ఇంట్లో మరణించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మేడ్చల్ ఎమ్మెల్యేగా దివంగత ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ఉన్న సమయంలో శ్రీనివాస్‌రెడ్డి చెన్నారెడ్డికి, మాజీ మంత్రి ఉమాదేవికి కుడి భుజంగా ఉన్నారు. డబీల్‌పూర్ సర్పంచ్‌గా, డబీల్‌పూర్ పీఏసీఎస్ అధ్యక్షుడిగా, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పలు పదవులను ఆయన నిర్వహించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో పార్టీ పదవులను పొందాడు. నమ్మిన సిద్ధాంతం కోసం తన చివరి శ్వాస వరకు కాంగ్రెస్‌లోనే ఆయన కొనసాగారు. మేడ్చల్ రాజకీయంలో తొలి తరం నాయకుడిగా ఆయన వెలుగొందాడు. ఆయన మృతి పట్ల మేడ్చల్ రాజకీయ నాయకులు పార్టీలకు అతీతంగా సంతాపం ప్రకటించారు.

మంత్రి మల్లారెడ్డి నివాళి..

శ్రీనివాస్‌రెడ్డి మరణ వార్త విన్న మంత్రి మల్లారెడ్డి డబీల్‌పూర్ గ్రామానికి వెళ్లి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా బీజేపీ సీనియర్ నేత మోహన్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికా నర్సింహారెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.